సాక్షి జగిత్యాల

ఆదివారం : 17 : మార్చి : 2024



నృసింహుడికి రూ. 31.29 లక్షలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ని హుండీ ద్వారా రూ.31,29,424 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్		సహర్
ఆది	6:32	సోమ	5:00

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.0/21.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో అదనపు కోర్టులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలో అదనపు కోర్టులు ఏర్పాటు చేసే అవకాశం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జగిత్యాల బార్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో ఫ్యామిలీ కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు వంటివి ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. జిల్లాకేంద్రంలో కోర్టులకు అవసరమైన వసతులు ఉన్నాయని హైకోర్టుకు నివేదిక అందించామన్నారు. కొత్త కోర్టుల ఏర్పాటుతో ఇక్కడి ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందని, న్యాయవాదులకు మరిన్ని అవకాశాలు మెరుగుపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ, సబ్ జడ్జి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ, మొదటి అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ జితేందర్, రెండో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ వినిల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కటుకం చంద్రమోహన్ పాల్గొన్నారు.

మూడోసారి బీజేపీదే అధికారం



బీజేపీలో చేరిన నాయకులతో ఎంపీ అర్వింద్

సారంగాపూర్: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకొస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శనివారం బీర్‌పూర్ జెడ్పీటీసీ పాత పద్మ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పాత రమేశ్ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. మరికొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు కూడా చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మోదీ మరోసారి ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. వారి వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, నాయకులు ఆడెపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



అష్టావధానంలో పాల్గొన్న కవులు

కోరుట్ల: కోరుట్ల భారతీ సాహిత్య సమితి స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత ఉపన్యాసకులు గండ్ర లక్ష్మణ్‌రావు చేసిన అష్టావధానం సాహితీప్రియులను రంజింపచేసింది. సాహిత్య సమితి అధ్యక్ష, కార్యదర్శులు కంజర్ల రామాచార్య, బట్టు హరికృష్ణ అష్టావధానంలో పాల్గొన్న కవులకు ధన్యవాదాలు తెలిపారు. ఏటా సాహిత్యసమితి అందించే అందె వెంకట్రాజం పురస్కారాన్ని గండ్ర లక్ష్మణ్‌రావుకు అందించారు. కార్యక్రమంలో భారతీ సాహిత్య సమితి ప్రతినిధులు అందె రాజేంద్రప్రసాద్, అందె శివప్రసాద్, ప్రకాశ్, భూమయ్య, శ్రీహరి, శేఖర్ పాల్గొన్నారు.

ఎన్డీఆర్‌ఎఫ్ సేవలు మరువలేని



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు

రాయికల్: ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ఎన్డీఆర్‌ఎఫ్ సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. శనివారం రాయికల్‌లో విజయవాడ టెన్త్ బీఎల్ ఎన్డీఆర్‌ఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో విపత్తులతో అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో వీరు తమ సేవలతో ఎన్నో ప్రాణాలు కాపాడారని గుర్తుచేశారు. ఆపద సమయాల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజేందర్ కుమార్, అనిల్ వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ వైస్‌చైర్మన్ రమాదేవి, తహసీల్దార్ ఖయ్యూం, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

కోడ్ కూసింది!



లోక్‌సభ షెడ్యూల్: నామినేషన్లు మొదలు: ఏప్రిల్ 18, చివరి తేదీ: ఏప్రిల్ 25, నామినేషన్లు పరిశీలన: ఏప్రిల్ 26
ఉపసంహరణ: ఏప్రిల్ 29, పోలింగ్ తేదీ: మే 13, ఎన్నికల ఫలితాలు: జూన్ 4

- షెడ్యూల్ విడుదలతో వేడెక్కిన రాజకీయం
- శనివారం మధ్యాహ్నం నుంచే అమల్లోకి ఎన్నికల కోడ్
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్
- మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్
- ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- ఇప్పటికే కాంగ్రెస్ మినహా బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
కరీంనగర్	1,81,093	1,81,388	43	99	3,62,623
చొప్పదండి	1,13,620	1,21,524	6	196	2,35,346
వేములవాడ	1,07,783	1,17,508	32	53	2,25,376
సిరిసిల్ల	1,19,140	1,25,967	8	106	2,45,221
మానకొండూర్	1,09,947	1,14,902	1	128	2,24,978
హుజూరాబాద్	1,21,294	1,27,967	7	164	2,49,432
హుస్నాబాద్	1,21,081	1,25,076	5	215	2,46,377

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్ల వివరాలు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
ధర్మపురి	1,11,962	1,17,647	06	133	2,29,748
రామగుండం	1,10,255	1,09,970	26	213	2,20,464
మంథని	1,17,271	1,21,820	17	155	2,39,263
పెద్దపల్లి	1,26,404	1,29,965	07	264	2,56,640
చెన్నూరు	95,974	97,264	7	134	1,93,379
బెల్లంపల్లి	86,802	88,530	13	163	1,75,508
మంచిర్యాల	1,38,472	1,40,559	25	334	2,79,390

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి: సార్వత్రిక ఎన్నికల సమరం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం మధ్యాహ్నం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల ప్రవర్తనా నియమావళి) అమల్లోకి వచ్చింది. ఇక నుంచి పార్టీలు, అభ్యర్థులంతా ఎన్నికల నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలుకు జిల్లాయంత్రాంగం అవసరమైన ఏర్పాట్లతో సిద్ధమైంది. జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల చేయగా, పోలింగ్‌కేంద్రాల గుర్తింపు పూర్తయ్యింది. అవసరమైన చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సిబ్బంది బదిలీలపై నిషేధం ఉండనుండగా, నేతలు ప్రార్థనా స్థలాల్లో ప్రచారం నిర్వహించరాదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు చేయకూడదు.రాజకీయ పార్టీల నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగిస్తున్నారు. మద్యం, డబ్బుల పంపిణీని అరికట్టేందుకు చర్యలు ప్రారంభించారు.

79 రోజుల తరువాత తేలనున్న ఫలితం

వచ్చే నెల 18 తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 25వరకు నామినేషన్లు స్వీకరణ, 26న పరిశీలన, 29వరకు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మే 13న పోలింగ్ నిర్వహించనుండగా, జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. నేటి నుంచి పోలింగ్‌కు 62రోజుల సమయం ఉండగా, విజేతలెవరో తెలియడానికి 79రోజుల వరకు ఆగాల్సిందే. ఎన్నికల ప్రక్రియ మొత్తం జూన్ 6తో ముగియనుంది. అప్పటి వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. దీంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాయంత్రాంగం గోడలపై ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన రైటింగ్స్, ఇతర రాతలను తుడిచివేయడం ప్రారంభించారు. ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగువేస్తున్నారు.

తేలాల్సింది కాంగ్రెస్ అభ్యర్థులే...

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలకు బీజేపీ తరుపున బండి సంజయ్, గోమాస శ్రీనివాస్‌లను బరిలో నిలవనుండగా, బీఆర్‌ఎస్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, కొప్పుల ఈశ్వర్ అభ్యర్థిత్వాలు ఖరారు అయ్యాయి. నిజామాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్, బీఆర్‌ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిలు బరిలో నిలుచున్నారు. ఈ మూడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థిత్వాలు ఖరారు చేయాల్సి ఉంది. కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారైతే ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

'పది'కి పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లావ్యాప్తంగా 67 కేంద్రాలు
- విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు
- అరగంట ముందే కేంద్రాలకు రావాలి
- నిమిషం నిబంధన నుంచి సడలింపు
- సాక్షి ఇంటర్వ్యూలో డీఈవో జగన్మోహన్‌రెడ్డి



డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: పదో తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు డీఈవో జగన్మోహన్‌రెడ్డి. ఎలాంటి పొరపాట్లు లేకుండా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు. ఈసారి నిమిషం నిబంధన నుంచి మినహాయింపు ఉందన్నారు. అయినప్పటికీ విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. వేసవికాలం కావడంతో విద్యార్థుల కోసం తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో డీఈవో జగన్మోహన్‌రెడ్డి 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: పదో తరగతి పరీక్షలకు ఎన్ని సెంటర్లు ఏర్పాటు చేశారు? ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీఈవో: ఈసారి జిల్లాలో మొత్తం 67 సెంటర్లు ఏర్పాటు చేశాం. రెగ్యులర్ కేంద్రాలు 64తోపాటు మరో మూడు ప్రైవేటు సెంటర్లను గుర్తించాం. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాం.

సాక్షి: ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు?

డీఈవో: జిల్లాలో మొత్తం 11,366 మంది పరీక్ష రాయబోతున్నారు. వీరిలో 5,602 బాలురు, బాలికలు 5,763 మంది ఉన్నారు. ప్రైవేటు విద్యార్థులు 841 మంది ఉన్నారు.

సాక్షి: సిబ్బందిని ఎంత మందిని నియమించారు?

డీఈవో: చీఫ్ సూపరింటెండెంట్లు 67 మంది, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు 67, అడిషనల్ అడిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు ఆరుగురు, ఫ్లయింగ్‌స్క్వాడ్స్ నలుగురు, కస్టోడియన్స్ 22, ఇన్విజిలేటర్లు 702 మందిని నియమించాం.

సాక్షి: ఎండకాలంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తాగునీటితోపాటు ప్రతి గదిలో ఫ్యాన్, ఫర్నిచర్ ఏర్పాటు చేశాం. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం.

సాక్షి: గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం సౌకర్యాలు?

డీఈవో: ఆర్టీసీ అధికారులతో మాట్లాడి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. ఆర్టీసీ బస్సుల ద్వారా విద్యార్థులు వస్తారు. సమయానికి అనుగుణంగా ఏర్పాటుచేశాం.

సాక్షి: నిమిషం నిబంధన ఉందా..?

డీఈవో: నిమిషం నిబంధన అమలులో లేదు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష ఉంటుంది. అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ప్రశాంతంగా పరీక్ష రాసుకునే అవకాశం ఉంటుంది.

సాక్షి: కొన్ని పాఠశాలలు హాల్‌టికెట్లు ఇవ్వలేదని సమాచారం..?

డీఈవో: హాల్‌టికెట్లు ఇవ్వని పాఠశాలలపై నేరుగా మాకు ఫిర్యాదు చేయవచ్చు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. లేకుంటే ఆ ఉ.TELA NGANA.GOV.IN ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సాక్షి: ఈసారి కూడా హ్యాట్రిక్ ఫలితాలు సాధిస్తారా..?

డీఈవో: కరోనా సమయంలో కొంత ఇబ్బంది పడ్డాం. ఈసారి ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేసి ఒక ప్రణాళికతో ముందుకెళ్లాం. ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తిచేశారు. రివిజన్ క్లాసులు అయిపోయాయి. ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానం సాధించేలా చూస్తాం.

సాక్షి: వసతులు లేని చోట ప్రత్యామ్నాయ చర్యలు..?

డీఈవో: గతంలో కొన్ని పాఠశాలల్లో వసతులు లేకుండే ఈసారి ఎలాంటి అలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. సౌకర్యాలన్నీ ఏర్పాటు చేశాం.

సాక్షి: పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి ఉందా..?

డీఈవో: పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులే కాకుండా ఇన్విజిలేషన్ సిబ్బందితోపాటు ఫ్లయింగ్‌స్క్వాడ్, పోలీసు సిబ్బంది ఎవరికీ అనుమతి లేదు.

ప్రధాని సభకు పటిష్ట బందోబస్తు

- 1600 మంది పోలీసులతో బందోబస్తు
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలో సోమవారం జరిగే ప్రధానమంత్రి బహిరంగ సభకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. జిల్లాకేంద్రంలో పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. బందోబస్తులో ఎనిమిది జిల్లాల నుంచి సుమారు 1600మంది అధికారులు, సిబ్బంది పాల్గొంటారని, ఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులను బాధ్యులుగా నియమించామని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను అప్రమత్తంగా నిర్వర్తించాలన్నారు. అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

బహిరంగ సభ సందర్భంగా జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్పీ తెలిపారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు భారీ వాహనాలకు అనుమతి లేదని, పట్టణంలో డ్రోన్లు ఎగురవేయడానికి అనుమతి లేదన్నారు. 18న పదో తరగతి పరీక్ష ఉండటంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వీలైనంత త్వరగా చేరుకోవాలని ఎస్పీ సూచించారు.

రాజకీయ లబ్ధి కోసమే కవిత అరెస్ట్



ధర్మపురి: రాస్తారోకోలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఇతర నాయకులు

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ నిరసనలు

ధర్మపురి: పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో కవితపై బీజేపీ, కాంగ్రెస్ కుట్ర పన్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ధర్మపురిలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. కవిత కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో ఈనెల 19న విచారణ ఉందని తెలిసినా కుట్రపూరితంగా ఈడీతో అరెస్టు చేయించారని మండిపడ్డారు. బడే బాయ్ మోదీ, చోటాబాయ్ రేవంత్‌రెడ్డి కవిత అరెస్టులో చేతులు కలిపారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మానసికంగా దెబ్బతీయడం కోసమే కవితను అరెస్టు చేశారని, వారి కుట్రలను ప్రజాక్షేత్రంలో బయటపెట్టి పోరాడుతామని అన్నారు. ఎస్సై ఉదయ్‌కుమార్ తమ సిబ్బందితో చేరుకుని రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, పట్టణశాఖ అధ్యక్షుడు ఆకుల రాజేశ్, కౌన్సిలర్లు, డైరెక్టర్లు, కో–ఆప్షన్ సభ్యులు నాయకులు తదితరులున్నారు.

కోరుట్లలో బీఆర్‌ఎస్ శ్రేణుల ధర్నా

కోరుట్ల: కవిత అరెస్టును నిరసిస్తూ కోరుట్లలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజకీయకక్షతో.. ఉద్దేశపూర్వకంగా కవితను అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, వైస్ఎంపీపీ చీటి స్వరూపారాణి, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ సాబీర్, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, చీటి వెంకట్రావు పాల్గొన్నారు.

మహిళలపై మోదీ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా?


కొండగట్టు(చొప్పదండి): మహిళలపై మోదీ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కవితను అరెస్ట్ చేయడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఎంపీపీ మేనేని స్వర్ణలత, పీఏసీఎస్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

మత్తు.. గమ్మత్తు.. చిత్తు!

- మత్తు బానిసలకు మార్ఫిన్ ఇంజెక్షన్లు
- ఆర్డర్‌పై నల్లమందు సరఫరా!
- కొరియర్ ద్వారా పార్సిల్స్ చేరవేత
- సైనిక్‌పురిలో తీగ లాగితే కదిలిన డొంక
- జగిత్యాల వైద్యుడు మదన్‌మోహన్ చీకటి దందా
- ఉమ్మడి జిల్లాలో డీసీఏ దాడులు విస్తృతం



జగిత్యాలలోని మానస ఈఎన్‌టీ ఆసుపత్రి



అక్రమంగా విక్రయిస్తున్న మార్ఫిన్ ఇంజెక్షన్లు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల: 'వైద్యో నారాయణో హరి' అంటారు. ప్రాణాలు కాపాడే వైద్యుడిని కనిపించే దైవంగా కొలుస్తాం. కానీ, ప్రాణాంతక మత్తు మందును పక్కదారి పట్టిస్తూ సాక్షాత్తూ వైద్యుడే చీకటి దందాకు తెరతీసిన వైనాన్ని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) అధికారులు వెలుగులోకి తెచ్చారు. మార్ఫిన్ లాంటి నార్కోటిక్ ఇంజెక్షన్లు, మాత్రలను హైదరాబాద్‌లోని పలువురు మత్తుకు బానిసైన వారికి కొరియర్/పార్సిల్ ద్వారా అందజేస్తున్న తీరును చూసి విస్తుపోయారు. ఇటీవల కరీంనగర్‌లో ఎటోలార్–పి అనే నిషేధిత మాత్రలను సరఫరా చేస్తున్న గోదాంపై దాడులు చేసిన అధికారులు తాజాగా మత్తు మందులను దుర్వినియోగం చేస్తున్న తీరును బయటపెట్టారు.

ఎలా చిక్కారు?

జగిత్యాలకు చెందిన జి.మదన్‌మోహన్ మానస హాస్పిటల్‌లో ఈఎన్‌టీ వైద్యుడు. ఇతను రోగులకు మత్తు కోసం వినియోగించే మార్ఫిన్ ఇంజెక్షన్లు, మాత్రలను అక్రమమార్గంలో మత్తుకు బానిసైన వారికి విక్రయిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్ సైనిక్‌పురి ప్రాంతంలోని శ్రీ సాయిబాబా ఆఫీసర్స్ కాలనీలోని ఓ ఇంట్లో మార్ఫిన్ ఇంజెక్షన్లు, మాత్రలు ఉన్నాయన్నా పక్కా సమాచారంతో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీ), తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వెర్మర్–15, రుమార్ఫ్ తదితర మార్ఫిన్ (నల్లమందుతో చేసేవి) ఇంజెక్షన్లు, మాత్రలు లభించాయి. అక్కడ తీగ లాగిన అధికారులకు డొంక జగిత్యాలలో దొరికింది. ఈ మందులన్నీ జగిత్యాలలోని మానస ఆసుపత్రి నుంచి డాక్టర్ మదన్‌మోహన్ ద్వారా వస్తున్నాయని గుర్తించారు. ఆ ఆస్పత్రి వాచ్‌మెన్ సాయంతో హైదరాబాద్‌లోని మత్తుబానిసలకు కొరియర్ చేస్తున్నారని దర్యాప్తులో తేలింది. ఇవి జగిత్యాలలోని గొల్లపల్లి రోడ్డులో ఉన్న మాన్విత ఫార్మసీకు చెందినవని కనిపెట్టారు. వాస్తవానికి నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాలు జరిపేందుకు ప్రత్యేక అనుమతి ఉంటుంది. ఆయా మందుల వినియోగానికి రిజిస్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. దాడుల సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్‌లో పలు అవకతవకలు ఉన్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా దాదాపు 75 మందులను సీజ్ చేశారు. దీని తరువాత కూడా డీసీఏ దాడులు ఉంటాయని 'సాక్షి' ముందే వెల్లడించింది. ఇదే క్రమంలో డాక్టర్ మదన్‌మోహన్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించారు.

మార్ఫిన్ ప్రాణాంతకం..

మార్ఫిన్ డ్రగ్స్ వినియోగం వల్ల శరీరంపై దుష్ప్రభావాలు చూపిస్తుంది. శారీరక, మానసిక, భావోద్వేగ సమస్యలకు కారణమవుతుంది. కేవలం ఆపరేషన్ చేసే సమయంలో నిపుణులైన వైద్యులే దీన్ని పేషెంట్‌కు ఇస్తారు. దీన్ని వైద్యుల సలహాతో కాకుండా వ్యక్తిగతంగా వినియోగించడం నేరం, ప్రమాదకరం. ఒక్కసారి దీనికి అలవాటైతే బానిసలవుతారు. ఆ మందు కోసం దిగజారి ప్రవర్తిస్తారు. ఏమాత్రం మోతాదు పెరిగినా ప్రాణాలు పోతాయి. వైద్యులు, ఫార్మసిస్టుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ప్రాణాంతక మందులు అక్రమంగా బయటికి వస్తున్నాయి. ఇలాంటి ఉదంతాలు మీ దృష్టికి వస్తే వెంటనే 1800–599–6969 నంబరుకు సమాచారం ఇవ్వాలని డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్ రెడ్డి ఉమ్మడి జిల్లావాసులకు విజ్ఞప్తిచేశారు. ఈ క్రమంలో సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోనూ పలు అక్రమాలపై డీసీఏకి ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం.

వైద్యుడి అరెస్ట్.. హైదరాబాద్ తరలింపు

ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఉన్న మాన్విత ఫార్మసీకి చెందిన డ్రగ్‌లైసెన్స్‌ను తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రద్దు చేసింది. డాక్టర్‌ను కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇతడిపై 197/2024 ప్రకారం కేసు నమోదైంది. నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలుంటాయని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.

హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ ఇవే

సల్ఫేట్ ఇంజెక్షన్ 50 ఆంపుల్స్, మార్ఫిన్ సల్ఫేట్ 30 టాబ్లెట్స్, మార్ఫిన్ సల్ఫేట్ ఇంజెక్షన్ 30 యాంపిల్స్, బుప్రెజెసిక్ ఇంజెక్షన్ 25 ఆంపుల్స్, డయోజెపామ్ ఇంజెక్షన్ 9 ఆంపుల్స్, రూమార్ఫ్ ఇంజెక్షన్ 10 ఆంపుల్స్, లిబ్రాక్స్ 46 టాబ్లెట్స్, బుప్రిజెసిక్ 2 ప్యాచ్‌స్, పెంటాజోసిస్ ఇంజెక్షన్ 2 ఆంపుల్స్, మెజోలం ఇంజెక్షన్ 7 సీసాలు, ఇంజెక్షన్ 25 ఆంపుల్స్, నాలోక్సన్ ఇంజెక్షన్ 3 ఆంపుల్స్, వెర్మోర్ ఇంజెక్షన్ 200 ఆంపుల్స్, రూమార్ఫ్ 10 ఎంజీ 10 ఆంపుల్స్, రూమార్ఫ్ 15 ఎంజీ 10 ఆంపుల్స్, వెర్మోర్ 15 ఎంజీ ఇంజెక్షన్ 30 ఆంపుల్స్, మెజోలం 10 మి.లీ ఇంజెక్షన్ నాలుగు సీసాలు.

క్లుప్తంగా

ఆన్‌లైన్ ప్రకటనలతో రూ.86వేలు స్వాహా

సారంగాపూర్: కోనాపూర్‌కు చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో ప్రకటనలు చూసి రూ.86 వేలు పోగొట్టుకుంది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం గ్రామానికి చెందిన మమతారాణి ఇన్‌స్టాగాం వాడుతోంది. అందులో ఓ ప్రకటన చూసింది. ఆ కంపెనీ వారు ఆ ప్రకటనను వాట్సాప్ గ్రూపుల్లో ఎంతమందికి పంపిస్తే అంత మొత్తం డబ్బులు జమ చేస్తామనడంతో నమ్మి రెండురోజులపాటు చాలామందికి పోస్టు చేసింది. సదరు కంపెనీ వారు మమతారాణికి రూ.400, రూ.500 జమచేశారు. అయితే సైబర్ నేరగాళ్లు రూ.వెయ్యి జమచేస్తే పెద్ద కంపెనీ ప్రకటనలు పంపేలా ప్రమోట్ చేస్తామని చెప్పడంతో ఆమె ఆ మొత్తం వారికి పంపింది. ఇలా మరో రూ.3 వేలు పంపమనడంతో అలా వెంటవెంటనే తన ఖాతా నుంచి మొత్తం రూ.86 వేలు పంపింది. తరువాత ఎదుటి వారి ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. మోసపోయానని గుర్తించిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

చిట్యాల(నల్లగొండ): నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన వనం వెంకటమ్మ, రాములు(48) దంపతులు తమ కూతురుకు వైద్యం చేయించేందుకు ఐదు రోజుల క్రితం చిట్యాలకు వచ్చారు. శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో రాములు చిట్యాలలోని భువనగిరి రోడ్డుకు వచ్చాడు. అక్కడ టీ తాగిన తర్వాత రోడ్డు దాటుతుండగా భువనగిరి వైపు వెళ్తున్న అశోక్ లీలాండ్ దోస్త్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

గాయపడిన వృద్ధుడు మృతి

సారంగాపూర్: మండలంలోని రంగపేటకు చెందిన బట్టు రాజేశం (71) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. రాజేశం రాయికల్ మండలం అల్లీపూర్‌లో తన బంధువులతో ఉంటున్నాడు. ప్రతిరోజు మండలంలోని రంగపేటకు వచ్చి కల్లు గీసి, అమ్ముకుని తిరిగి ఇంటికి తన ద్విచక్రవాహనంపై వెళ్తుంటాడు. ఎప్పటిలాగే శుక్రవారం కూడా వెళ్తుండగా.. మండలంలోని నాగునూర్ శివారులో ఎడ్లబండిని ఢీకొట్టాడు. కింద పడి తీవ్రంగా గాయపడిన అతడిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతిచెందాడు. మృతుడి కుమార్తె శారద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను దొంగలించిన ఇద్దరు అరెస్ట్

మెట్‌పల్లి: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో రెండు రోజుల క్రితం నిలిపి ఉంచిన ఆటోను దొంగలించిన కేసులో నిజామాబాద్‌కు చెందిన షేక్ అలీ, ఫాజిల్‌ను శనివారం వెంకట్రావ్‌పేటలో పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

బల్దియాలకు నిధుల గండం

- 9 నెలలుగా నిలిచిన ఆర్థిక సంఘం నిధులు
- పట్టణాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- ఐదు బల్దియాలకు రూ.17.10 కోట్లు పెండింగ్
- అరకొర ఆదాయంతో నెట్టుకొస్తున్న బల్దియాలు


డ్రైనేజీ పనుల్లో కార్మికులు

ధర్మపురి: మున్సిపాల్టీల్లో మౌలిక వసతులు, పచ్చదనం, పరిశుభ్రత, తాగునీరు, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం పట్టణ ప్రగతి కింద నిధులు మంజూరు చేస్తుంది. జనాభా ప్రాతిపదికన మంజూరు చేస్తున్న ఈ నిధులు తొమ్మిది నెలలుగా నిలిచిపోవడంతో పట్టణాల్లో అభివృద్ధి పనులు కుంటుపండుతున్నాయి. మున్సిపాల్టీలకు అసలే తక్కువ ఆదాయం.. ఆపై నిధుల కొరత వేధిస్తోంది. ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక సంఘం నిధులు 9నెలలుగా నిలిచిపోవడంతో పనులు అస్తవ్యస్తంగా మారాయి. జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలుగా ఉన్నాయి. పట్టణాల్లో వివిధ అభివృద్ధి పనులకు పట్టణ ప్రగతి కింద కేంద్రం ఎంత చెల్లిస్తుందో.. రాష్ట్ర ప్రభుత్వం అంతే చెల్లించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెలా నిధులు మంజూరు చేస్తాయి. ఆ నిధులతో పట్టణాల్లో చేపట్టే మౌలిక వసతులు, పరిశుభ్రత, పచ్చదనం, లేబర్ల జీతభత్యాలు, సెంట్రల్ లైటింగ్, వైకుంఠధామాలు, రోడ్ల విస్తరణతోపాటు విద్యుత్ బకాయిల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది.

తొమ్మిది నెలలు.. రూ.17.10 కోట్లు

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు తొమ్మిది నెలలుగా ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. తొమ్మిది నెలలకుగాను సుమారు రూ.17.10 కోట్లు రావాల్సి ఉంది. ఈ నిధులు నిలిచి పోవడంతో మున్సిపాల్టీల్లో అభివృద్ధి కుంటుపడుతోంది.

అరకొర ఆదాయం

జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీలు అరకొర ఆదాయంతో నెట్టుకొస్తున్నాయి. ఏటా ఆస్తిపన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లు, ప్రచార బోర్డులు తదితరాల ద్వారానే ఆదాయం సమకూరుతోంది. అయితే బిల్లులు సకాలంలో చెల్లించకపోడంతో ఖర్చులకు సరిపోని పరిస్థితులున్నాయి. చివరకు సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితి వస్తోంది. ఆర్థిక సంఘం నిధుల్లో కేంద్రం కొంతవరకు చెల్లించినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 9 నెలలుగా మంజూరు చేయడం లేదు. ఈ క్రమంలో అన్ని బల్దియాల ప్రజలు కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

మున్సిపాల్టీల వారీగా నెలకు రావాల్సిన నిధులు

బల్దియా	నెలకు రావాల్సింది	మొత్తం
ధర్మపురి	రూ.12లక్షలు	రూ.1.08 కోట్లు
జగిత్యాల	రూ.72లక్షలు	రూ.6.48 కోట్లు
కోరుట్ల	రూ50లక్షలు	రూ.4.50 కోట్లు
మెట్‌పల్లి	రూ.44లక్షలు	రూ.3.96 కోట్లు
రాయికల్	రూ.12లక్షలు	రూ1.08 కోట్లు

నిధులు వస్తేనే..



మున్సిపాలిటీలకు రావాల్సిన పట్టణ ప్రగతి నిధులతోనే అభివృద్ధి పనులు ముందుకు కదులుతాయి. తొమ్మిది నెలలుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిధుల పెండింగ్‌పై ప్రభుత్వానికి నివేదికలు పంపించాం.

– శ్రీనివాసరెడ్డి కమిషనర్

ఎన్నికల నియమావళి పాటించాలి

- కోరుట్ల ఆర్డీవో ఆనంద్ కుమార్


మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్ కుమార్

కోరుట్ల: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు ఎన్నికల నియమావళిని పాటించాలని కోరుట్ల ఆర్డీవో ఆనంద్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో శనివారం సమావేశమయ్యారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు సహకరించాలన్నారు. నియోజకవర్గంలో కోరుట్ల, మెట్‌పల్లి బల్దియాలతోపాటు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో 2,44,034 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో మోడల్ కండక్ట్ బృందాలు 6, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 6, స్టాటిక్ సర్వేలయెన్స్ 6, వీడియో సర్వేలయెన్స్ 6, వీడియో వ్యూయింగ్ టీంలు 6 ఉంటాయన్నారు. ప్రతి బృందానికీ గెజిటెడ్ అధికారి టీం లీడర్‌గా ఉంటారని పేర్కొన్నారు. ఈ బృందాలు రాజకీయ నాయకులు నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని పరిశీలిస్తారన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతగా నిర్వహించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. అధిక మొత్తంలో డబ్బులు రవాణా చేసుకునే వారు ఆధారాలతో తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కోరుట్ల తహసీల్దార్ కిషన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో భోజనం తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని నాచుపెల్లి జేఎన్టీయూలో బాలుర మెస్‌ను ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఆహారం అందిస్తున్నారు? పరిసరాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

తండ్రిపై కొడుకు గొడ్డలితో దాడి

రాయికల్: మండలంలోని ధర్మాజీపేటకు చెందిన మ్యాకల గంగారెడ్డిపై అతడి కుమారుడు మ్యాకల అంజయ్య దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈనెల 15న రాత్రి డబ్బుల విషయంలో తండ్రీకొడుకులు గొడవపడ్డారు. అయితే తండ్రిని చంపుదామనే ఉద్దేశంతో అంజయ్య గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన గంగారెడ్డిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గంగారెడ్డి చెల్లెలు సులోచన ఫిర్యాదు మేరకు అంజయ్యపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

బావిలో పడి యువకుడు మృతి

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన ఇంటూరి సుభాష్(25) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన సుభాష్ ఈనెల 10న రాత్రి బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు సుభాష్‌గా గుర్తించారు. సుభాష్ మేనమామ సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

మెట్‌పల్లి: పట్టణ శివారులోని ఆరపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురు మహిళలు రోడ్డు దాటుతుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు.

చంపేసి కాలువలో పడేశారు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చొప్పదండి: చొప్పదండి పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో గల డీ87 ఉప కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహం ఆనవాళ్లను బట్టి చంపేసి.. కాళ్లు, చేతులు కట్టేసి కాలువలో పడేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీ87 ఉప కాలువలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని లస్కర్ గోపాల్ గుర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ప్రకాశ్‌గౌడ్, ఎస్ఐ ఉపేంద్రచారి గుర్తుతెలియని మృతదేహం కాలువలో కొట్టుకొచ్చినట్లు గుర్తించి బయటకు తీయించి పోస్టుమార్టం నిర్వహించారు. సుమారు 30 నుంచి 40 వయస్సున్న యువకుడిని పక్షం రోజుల క్రితం హత్య చేసి కాలువలో పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎత్తు 5 అడుగుల ఆరు అంగుళాలుండగా.. మృతుడు నలుపు రంగు టీషర్టు, మెరూన్ కలర్ కార్గో పాయింట్ ధరించి ఉన్నాడు. పాయింట్ జారిపోకుండా నడుముపై తెలుపు రంగు తాడు కట్టుకున్నట్లు గుర్తించారు. మృతుడి పళ్లు గారపట్టి, ఎత్తు పళ్లుగా ఉన్నట్లు, ముఖం, ఇతర శరీర భాగాలు కుళ్లిపోయి గుర్తు పట్టలేనివిధంగా మారిందని పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు కాళ్లు, చేతులు కట్టేసి హత్య చేసి కాలువలో పడేశారా.. లేదా హత్య చేసి కాళ్లు, చేతులు కట్టేసి కాలువలో పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గోపాల్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి సమాచారం కావలసినవారు చొప్పదండి పోలీసులను సంప్రదించాలని కోరారు.

సంప్రదాయంగా 'అల్ఫోర్స్ సంస్కృతి'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్ వావిలాపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ వార్షికోత్సవ సంబరాలు శనివారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. అల్ఫోర్స్ సంస్కృతి పేరిట సాంప్రదాయబద్ధంగా సాగిన వార్షికోత్సవ వేడుకలను రిటైర్డ్ ప్రిన్సిపల్ డా.మధుసూదన్‌రెడ్డితో కలిసి అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను పరిపూర్ణం చేసుకునేందుకు, తల్లిదండ్రుల కలలను సంపూర్ణం చేసేందుకు కష్టపడి, ఇష్టపడి విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణకు, నాణ్యమైన విద్యకు అల్ఫోర్స్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ఈ విద్యా సంస్థలో చదవడమే గొప్ప అవకాశంగా భావించి దేశం గర్వించదగ్గ స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వార్షిక ప్రణాళికలో భాగంగా నిర్వహించిన పలు పరీక్షల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

గణిత ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్'కు పతకాలు



కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు సాధించినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. కె.హవిష్‌తేజ్, ఎ.విహాన్‌కృష్ణ (4వ తరగతి), జి.జోయల్ డేవిస్, బి.కార్తికేయ (4వ), సీహెచ్ దుర్శెట్టి (5వ), శివస్మరన్‌రెడ్డి (6వ), టి.అమిత్‌విక్రమ్, ఎ.గౌతమి (7వ), హర్ష అమిరిశెట్టి (8వ), అక్షిత, బి.ఆకృతి (9వ)లు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలతోపాటు ఎక్స్‌లెన్సీ సర్టిఫికెట్లు గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. ఈమేరకు ఆ విద్యార్థులను శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా వీఎస్ఆర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గణితానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, ప్రాథమిక స్థాయిలోనే గణితంపై పట్టు సాధించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావాలి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలం రేకులపల్లి, సారంగాపూర్ మండలం బట్టపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో వందరోజుల్లో కాంగ్రెస్ అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుచుకోవాలన్నారు. బట్టపల్లి మాజీ సర్పంచ్ అర్రె లక్ష్మీ, ప్రేమానందం, గోనే వంశీధర్‌రావు, 200మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట

జగిత్యాల: గంగపుత్రుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్సీ అన్నారు. అన్నపూర్ణ చౌరస్తాలో గంగపుత్ర సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడారు. కులవృత్తుల వారు ఆర్థికంగా ఎదిగేందుకు అండగా ఉంటుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, బింగి సుమ, పద్మ, కోండ్ర జగన్ పాల్గొన్నారు.

ఆరునెలల్లో యావర్‌రోడ్ విస్తరణ

జిల్లాకేంద్రంలోని యావర్‌రోడ్డును ఆరునెలల్లో 100 ఫీట్లకు విస్తరిస్తామని, ఇందుకు రూ.100 కోట్లు కేటాయించేలా చూస్తామని ఎమ్మెల్సీ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. 1994 ఎన్నికలకు ముందు 40ఫీట్ల రోడ్‌ను 60 ఫీట్లకు విస్తరించామని, 2014 తర్వాత దానిని 100 ఫీట్లకు విస్తరించాలని తీర్మానం చేసినా గత ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల విస్తరణకే పరిమితమైందన్నారు. రోడ్డు విస్తరణతో ఎంతమందికి పరిహారం చెల్లించాల్సి వస్తుందో ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బైపాస్‌తో యావర్ రోడ్‌పై ట్రాఫిక్ తగ్గిందని, నర్సింగాపూర్ బైపాస్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త మున్సిపల్ చైర్‌పర్సన్ పారదర్శకపాలన అందించాలన్నారు. సిటిజన్ చార్ట్ ప్రకారం సేవలందించాలన్నారు. మున్సిపల్‌లో గ్రీవెన్స్‌చార్ట్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ అనిల్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరుట్ల బీజేపీలో 'సురభి' కలకలం

- అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి పనిచేయలేదట..
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదులు
- దూరం పెడుతున్న కేడర్


సురభి నవీన్‌కుమార్

కోరుట్ల: మూడేళ్ల క్రితం.. అప్పటి బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరి.. కోరుట్ల సెగ్మెంట్‌లో చురుకైన పాత్ర పోషించిన సురభి నవీన్‌కుమార్ వ్యవహారం పార్లమెంట్ ఎన్నికల ముందు అదే పార్టీ వర్గాల్లో చర్చనీయంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి పనిచేయలేదనే ఆరోపణలతో పార్టీ వర్గాలు ఆయనను కొన్నాళ్లుగా దూరంగా ఉంచుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అసలేం జరిగింది..?

కోరుట్ల సెగ్మెంట్ నుంచి పార్టీ టికెట్ ఆశించిన సురభి నవీన్‌కుమార్‌కు పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా అవకాశం ఇచ్చింది. తనకు కోరుట్ల నుంచి బీజేపీ టికెట్ దక్కుతుందన్న భావనతో మూడేళ్లుగా పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ పటిష్టతకూ పనిచేశారన్న అభిప్రాయాలు ఉన్నాయి. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ ఎంపీలు అందరూ తమతమ పార్లమెంట్ పరిధిలోని ఏదైనా అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేయాలని పార్టీ అధిష్టానం నిర్ణయించడంతో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కోరుట్ల నుంచి పోటీ చేశారు. ఆ సమయంలో నవీన్‌కుమార్‌కు మల్లాపూర్ మండలంలో ఎన్నికల ప్రచార ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. అయితే ఫలితాల్లో మల్లాపూర్ మండలంలో బీజేపీ మూడో స్థానంలో నిలిచింది. ఆ ప్రభావం నవీన్‌పై పార్టీలో ప్రతికూలతకు కారణమైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పార్లమెంట్ ఎన్నికల వేళ..

అసెంబ్లీ ఎన్నికల అనంతరం నవీన్‌కుమార్ పార్టీ కోసం పనిచేయలేదని కొంతమంది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కొన్నాళ్లుగా బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలకు దూరంగా ఉంచుతోందన్న ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల క్రితం ఆర్మూర్‌లో జరిగిన పార్టీ సమావేశాలకు రావొద్దని నవీన్‌కుమార్‌కు పార్టీ పెద్దల నుంచి సూచనలు వచ్చినట్లు సమాచారం. కోరుట్ల సెగ్మెంట్‌లో అంతోఇంతో పట్టున్న నాయకుడిగా పేరు తెచ్చుకుని.. రాష్ట్ర కార్యవర్గసభ్యునిగా కొనసాగుతున్న నవీన్‌ను ఎన్నికల సమయంలో పార్టీకి దూరంగా పెట్టడం సరికాదని పార్టీలోని కొన్నివర్గాలు అంటున్నాయి.

తెగుళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాణి


కోమటికొండాపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మెట్‌పల్లిరూరల్: వరి పంటకు అగ్గి తెగుళ్లు రాకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాణి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్‌లో పలువురు రైతుల వరి పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. తెగుళ్ల సోకితే యూరియా ఎక్కువగా వాడొద్దన్నారు. తెగుళ్లపై నిర్లక్ష్యం వహించినా దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో రవళిక, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

పెగడపల్లి: మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను శనివారం ధర్మపురి వ్యవసాయ సహాయ సంచాలకులు రాంచందర్ తనిఖీ చేశారు. పెగడపల్లి, నంచర్ల సహకార సంఘాల్లో రికార్డులు పరిశీలించారు. ఎరువుల లెక్కలు పక్కగా ఉండాలని, ఈ పాస్ మిషన్, బయోమెట్రిక్ పద్ధతిన రైతులకు ఎరువులు అందించాలని సూచించారు. రైతులకు తప్పనిసరిగా రశీదు అందించాలన్నారు. ఏఈవో నవీద్, ఆయా సంఘాల సీఈవోలు గోపాల్‌రెడ్డి, మధూకర్ పాల్గొన్నారు.

కొత్తపేటతో సంబంధాలు పెట్టుకోవద్దు



- శివాజీనగర్ గ్రామస్తుల తీర్మానం
- ఆలస్యంగా వెలుగులోకి

రాయికల్: రాయికల్ మండలం కొత్తపేటలోని నాగాలయం బోర్డుపై శివాజీనగర్ గ్రామం పేరు పెట్టాలని, కొత్తపేటలో ఉన్న ఆస్తుల్లో వాటా తిరిగి చెల్లించాలని, అప్పటివరకు కొత్తపేటలోకి శివాజీనగర్ గ్రామస్తులు ఎవరూ ఎలాంటి సేవలూ చేసేది లేదని తీర్మాన చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తపేటలో గతంలో ఒడ్డెరకాలనీ ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒడ్డెరకాలనీశివాజీనగర్ కలిసి నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. కొత్తపేట నాగాలయం బోర్డుపై తమ గ్రామం పేరు పెట్టాలని ఏటా శివరాత్రి సందర్భంగా వివాదం చెలరేగుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదు. ఈ క్రమంలో శివాజీనగర్ గ్రామస్తులు ఇక నుంచి కొత్తపేటలో వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలు, వైద్యసేవలు చేయించుకోవద్దని వారం క్రితం మౌఖికంగా తీర్మానం చేశారు. నాగాలయం బోర్డుపై తమ గ్రామం పేరు పెడితేనే యథావిధిగా స్నేహసంబంధాలుంటాయని సూచించారు. అప్పటివరకు కొత్తపేటలో టిఫిన్, క్రయవిక్రయాలు, వ్యవసాయ పనులకు వెళ్లడం వంటివి చేయరాదని తీర్మానించుకున్నారు. ఈ రెండుగ్రామాల సమస్య తారాస్థాయికి చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీసులు స్పందించి శాంతియుతమార్గంలో వివాదాన్ని పరిష్కరించాలని ఇరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బావిలో పూడిక తీస్తుండగా విద్యుదాఘాతం: ఒకరి దుర్మరణం

ధర్మారం(ధర్మపురి): నర్సింహులపల్లి గ్రామానికి చెందిన సూర వెంకటస్వామి (21) శనివారం వ్యవసాయ బావిలో పూడికతీత పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన లక్కాకుల రాజయ్య వ్యవసాయ భూమిని ఇదే గ్రామానికి చెందిన పోలం లింగయ్య కౌలుకు తీసుకున్నాడు. వరి సాగుకు సరిపడా నీరు బావిలో లేకపోవడంతో ఇదే గ్రామంలో నివాసం ఉంటూ క్రేన్ సాయంతో బావులు తవ్వుతున్న నల్గొండ జిల్లాకు చెందిన సూర సైదులుకు కౌలు రైతు లింగయ్య పూడిక తీత పనులు అప్పగించాడు. బావికి క్రేన్ అమర్చి మట్టిని క్రేన్ డబ్బాలో వేస్తున్న క్రమంలో వెంకటస్వామి ప్రమాదవశాత్తు డబ్బాకు కరెంట్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు.